క్లుప్తంగా

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ధరూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలకు మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని మాస్టర్ రషీద్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ షిప్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్ 19 విభాగంలో 53 కేజీల, 57 కేజీల విభాగంలో ధరూరుకు చెందిన విద్యార్థినులు వినోద, గాయత్రిలు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను రాష్ట్ర తైక్వాండో జనరల్ సెక్రెటరీ శ్రీహరి, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేలు విరాళం



ధరూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి ఆలయ నిర్మాణం కోసం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ అధ్యక్షుడు అడివిల ఆంజనేయులు, కమిటీ సభ్యులు విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సభ్యులు జగదీష్, శ్రీను, వెంకటేష్ నాయుడు, రవీందర్ నాయుడు, సద్దల బీసన్న పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

కేటీదొడ్డి: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ తిక్కన్న అన్నారు. బుధవారం మండలంలోని సోంపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 50 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 10 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్వేత, సూపర్‌వైజర్ బాలముణెమ్మ, కృష్ణ, ఏఎస్ఎం నర్మద, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోపణలు సరికాదు’

రాజోళి: మండల కేంద్రం శివారులో ఒక భూమికి బదులు మరొక భూమిని సర్వే చేశారని తనపై ఆరోపణలు చేయడం తగదని సర్వేయర్ బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన కొందరు తనపై ఉద్దేశపూర్వకంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. ఒక సర్వే నెంబర్‌కు బదులు, మరొక సర్వే నెంబర్లో సర్వే చేశారన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. సర్వే కోసం పక్కన ఉన్న రైతులకు నోటీసులు ఇవ్వగా ఎవరూ స్పందించకపోవడంతో అక్కడ సర్వే చేయలేదని తెలిపారు.

10న లోక్ అదాలత్

రాజోళి: రాజీతోనే ఏళ్ల తరబడి పేరుకున్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్ఐ సీహెచ్ కుర్మయ్య అన్నారు. ఈ నెల 10 న లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. బీమా, మనోవర్తి, అత్తింటి వేధింపులు, సివిల్, క్రిమినల్ కేసులు, చట్ట రీత్యా రాజీకి అర్హత కలిగిన కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. గద్వాల కోర్టులో జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

అలంపూర్ రూరల్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కేటీదొడ్డి: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జోగుళాంబ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు మహనంది రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, నరేందర్, రాజు, బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి, శ్రీను, నాగేష్, గద్వాల కర్రెప్ప పాల్గొన్నారు.

అధికారులను అడ్డగింత

గద్వాల రూరల్: గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల కేటాయింపులో మిగిలిన పది శాతం స్థలంలో పేదలకు ఎలా పట్టాలిస్తారని పిల్లిగుంట్ల కాలనీ వాసులు అధికారులను నిలదీశారు. బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలో పిల్లిగుంట్లలోని కాలనీలో పదిశాతం స్థలాన్ని డోజర్ సాయంతో చదును చేసేందుకు యత్నించారు. దీంతో కాలనీవాసులు పనులను అడ్డుకున్నారు. కొద్దిసేపు తహసీల్దార్‌కు, కాలనీవాసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అయినా పనులు చేసేందుకు ముందుకు సాగగా డోజర్‌కు అడ్డుగా కూర్చున్నారు. కాలనీవాసులకు కౌన్సిలర్ త్యాగరాజు, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎలా పట్టాలు ఇస్తారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

అధ్వానంగా రోడ్లు

- వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడు నుంచి మానవపాడు వెళ్లే రోడ్డు దుస్థితి

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్ద పోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల మధ్య రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బీటీ రోడ్లు ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రయాణించాలంటే వెనకంజ వేస్తున్నారు. రాత్రివేళలో గుంతలు కన్పించక నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి..



చెన్నిపాడు–మానవపాడు రోడ్డు మార్గం ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రివేళ గుంతలు కన్పించడం లేదు. పలువురు వాహనదారులకు ప్రమాదాలబారిన పడ్డారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– చిన్న వెంకట్రాములు, మానవపాడు

అధికారులు చర్యలు తీసుకోవాలి..



కలుకుంట్ల నుంచి మద్దూరుకు వెళ్లే దారిలో కలుకుంట్ల బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలతో వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతు చేయాలి. ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డును బాగు చేయాలి.

– ఆత్మలింగారెడ్డి, సర్పంచ్, కలుకుంట్ల

టెండర్ వేశాం కాని..

రోడ్లపై గుంతలు ఏర్పడింది వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మానవపాడు రోడ్డుకు రూ.4 కోట్లు, కలుకుంట్ల రోడ్డుకు 3.40 లక్షలు టెండర్ వేశాం. ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఏఈ, ఆర్అండ్‌బీ మానవపాడు

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

అయిజ: ఈ నెల 8న నిర్వహించే చెరువు పండుగ సంబరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశించారు. బుధవారం పట్టణ సమీపంలోని రాయచూర్ రోడ్డు సమీపంలో కొత్త చెరువులో చెరువుల పండుగ కార్యక్రమాన్ని సంబంధించిన ఏర్పాట్లను ఏఈ గోపాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బతుకమ్మలతో భారీ ర్యాలీగా కొత్తచెరువు చేరుకుంటారని తెలిపారు. చెరువుకట్టవద్ద కట్ట మైసమ్మ పూజలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అయిజలో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గట్టు: మండల కేంద్రంలోని చెరువు వద్ద దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువు పండుగ నిర్వహిస్తునట్లు సర్పంచ్ ధనలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కృష్ణమూర్తితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలు, రైతులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



బస్వాపురంలో పోస్టర్లను విడుదల చేస్తున్న జంబురామన్‌గౌడ్

గట్టు: సీఎం కేసీఆర్ గద్వాల పర్యటనను విజయవంతం చేయాలని గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడులు కోరారు. బుధవారం బస్వాపురం, తుమ్మలచెరువు, వాయిల్ కుంటతండా, రాయాపురం, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 12న గద్వాలకు సీఎం కేసీఆర్ రానున్నారని, మండలంలోని అన్నీ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గద్వాలకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరు ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



కుర్తిరావల్‌చెర్వులో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ధరూరు: చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని సోంపూరం పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు సోంపురం, పారుచర్ల తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి తిరిగి బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. బడికి వెళ్లని, బడి మానేసిన విద్యార్థులను కలిసి చదువుకుంటే కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, సీఆర్‌పీ నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్ జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



సోంపురంలో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బడి ఈడు పిల్లల బడిలో చేర్పించాలి..

మల్దకల్: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్ గ్రామస్తులకు సూచించారు. బుధవారం మండలంలోని కుర్తిరావల్‌చెర్వు, పెద్దొడ్డి, మల్దకల్ గ్రామాలలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చిన్నారులతో బడిబాట ర్యాలీ తీశారు. బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతికుమార్, జాకీర్ హుస్సేన్, నర్సింహులు, చంద్రశేఖర్‌రెడ్డి, మునెప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని ఉట్కూర్ పాఠశాలలో బుధవారం బడిబాటపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి అశోక్‌కుమార్, సర్పంచ్ ఆంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్ తాహీరా బేగం, క్యాతూర్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్ఎం బాలాజీ కృష్ణకుమార్ హాజరయ్యారు. ఎంఈఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సలీం, సుధాకర్‌రెడ్డి మద్దిలేటి, రాజు, తదితరులు పాల్గొన్నారు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

శాంతినగర్: పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ నరసింహులు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఆయా ప్రైవేటు పాఠశాలల యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆయా పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహులు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

అయిజ: మండలంలోని మూగోనిపల్లి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. 108 వాహనానికి సంబంధించిన సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన భీమేష్, నరసింహులు మోటార్ సైకిల్‌పై అయిజకు వెళ్తున్నారు. మూగోనిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో భీమేష్, నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

తండ్రి, కూతురికి..

అయిజ: మండలంలోని రాజాపురానికి చెందిన రాంబాబు తన కూతురుతో కలిసి బుధవారం తెల్లవారుజామున బైక్‌పై గద్వాలకు బయలుదేరారు. అయితే అయిజ – పులకల్ రోడ్డుపై తుపత్రాల గ్రామం వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో తండ్రికి గాయాలుకాగా కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి.

ఎంపీని అరెస్టు చేయాలని నిరసన

గద్వాల అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఢిల్లీలో రెజ్లర్లు నిరసన తెలుపుతున్నా ఎంపీని అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, వెంకటేష్, పరుశరాముడు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన వడ్డే వీరమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు బుధవారం మృతురాలి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం సేవాదళం ఆధ్వర్యంలో పోతురాజు సోమనాద్రి సూచన మేరకు కుటుంబ సభ్యులకు రూ. 5,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, సుంకన్న, కొండన్న, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అలంపూర్: వరద ముంపునకు గురైన అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంతోష్ నగర్ కాలనీ వాసులు ఆర్డీఓ రాములును కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓను కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. వరదల సమయంలో విచారణ చేసిన అధికారులు ముంపు ప్రాంతంగా గుర్తించి ఇళ్ల స్థలాల ఇస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఇప్పటి వరకు కాలనీలో ఉన్న ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. గతంలో స్థానిక అధికారులతోపాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. న్యాయం చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఇళ్ల స్థలాల జాబితాలో మాకు స్థానం కల్పించడం లేదని వాపోయారు. ప్రస్తుతం అర్హుల జాబితా సిద్ధం చేస్తుండటంతో అధికారులు మాకు న్యాయం చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రేమదాసు, రాఘవేంద్ర, విజయ్, ప్రతాప్, జయన్న, అబ్రహం, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

జన సురక్షపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ విశాల్

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ విశాల్ అన్నారు. బుధవారం మండలంలోని గంగన్‌పల్లిలో నాబార్డ్ వారి సౌజన్యంతో జన సురక్షపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ సేవలను వివరించారు. సామాజిక భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కిశోర్, హుస్సేన్, క్యాషియర్ హనుమంతు నాయుడు, ఏపీఎం అన్నపూర్ణ, పరుషరాం, కిరణ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



అలంపూర్ చౌరస్తాలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రం గద్వాలలో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి, వడ్డేపల్లి మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా బహిరంగ సభపై చర్చించారు. జిల్లా కేంద్రంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అయిజ రోడ్డు దగ్గర మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ఉర్సు నిర్వహించుకుందాం..

ఐక్యతతో హజ్రత్ షా–అలీ–పహిల్వాన్ ఉర్సు ఉత్సవాలను నిర్వహించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉర్సు నిర్వహణపై ఆయా శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, ఆర్డీఓ రాములు, తహసీల్దార్ సుభాష్ నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, దర్గా ఉర్సు నిర్వాహక కమిటీ, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉర్సు నిర్వాహణపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈ నెల 11వ తేది నుంచి 14వ తేదీ వరకు ఉర్సు నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, రవాణ సౌకర్యాల కల్పనకు ఆయా శాఖలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, పుర ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ మంజూరు చేయాలని వినతి..

గద్వాల జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంను బుధవారం అఖిల పక్షం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే మెడికల్ కాలేజీని మంజూరు చేయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గంజిపేట రాజు, వెంకటస్వామి, ఆలూరు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అయిజ: పట్టణంలోని పెద్ద ఆంజనేయ స్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం శివలింగ ప్రతిష్ఠతోపాటు గణపతి, కుమార స్వామి, భవాని, నవగ్రహ, నాగ విగ్రహాల ప్రతిష్ఠ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల ప్రవేశం, నాంది దేవత ఆవాహనం, షోడశోపచార పూజ, అఖండ దీపారాధన, అగ్ని కార్యము, దీక్షా, గణపతి, శాంతి, వాస్తు హోమాలు చేశారు. అనంతరం వాస్తు మండల ఆరాధన, మూలమంత్ర అనుష్ఠానములు, రుద్ర హోమము, నవగ్రహ హోమము, మన్యు సూక్త పారాయణములు, మూలమంత్ర జపములు, అభిషేకము నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం వడ్డేపల్లి మండలంలోని తనగల మల్లమ్మకుంట, ఆర్డీఎస్ కాల్వలను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాగరాజు, నాగశిరోమణి మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ఈ ఏడాది పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు సాగుచేయగా పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. రైతులు కంటతడిపెడుతుంటే దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్డీఎస్ నుంచి 87,500 ఎకరాలకు సాగునీరందాల్సి ఉండగా కేవలం 15 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, రుక్మానందరెడ్డి, జయన్న, షేక్షావలి ఆచారి, మద్దిలేటి, దేవేందర్, కృష్ణకాంత్‌లు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ



ముండ్లదిన్నెలో టీబీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: టీబీ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సూపర్‌వైజర్ జయప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని ముండ్లదిన్నెలో టీబీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. రెండు వారాలుగా దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, నీరసం ఉన్నట్‌లైతే వెంటనే వైద్యులకు సమాచారమివ్వాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు వారికి ఉచితంగా మందులు, ఆర్థికసాయం నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు శాందేవి, పద్మ సిబ్బంది గురుబయ్య, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాజోళి: మండలంలోని చింతల్ క్యాంపు గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డికి వినతి పత్రం అందచేశారు. బుధవారం చింతల్ క్యాంపు గ్రామస్తులు కర్నూల్‌లోని చల్లా నివాసంలో ఆయనను కలిశారు. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కావల్సిన అన్నీ అర్హతలు ఉన్న చింతల్ క్యాంపు గ్రామాన్ని పంచాయతీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బస్వరాజు, శ్రీనువాసులు, వెంకటేశ్వర్లు, నాగరాజు గౌడ్, బీచుపల్లి, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు

అలంపూర్ రూరల్: ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని బీఎస్పీ జిల్లా ఆధ్యక్షుడు కేశవ్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీఎస్ రిజర్వాయర్ సాగునీటిపై రైతులకు ఇచ్చిన హామీలు బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్ పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం వరద బాధితులకు ఇండ్లు పంపిణీ చేయాలని, కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని ఆర్ఐ శ్రీవాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్, మధుగౌడ్, రవిచందర్, విజయ్‌కుమార్, యామిని సుంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.